బ్రతుకు తెల్లవారింది

శ్రీమతి బి. నీలవతి

అది పెద్ద బంగళా కాదు, అంత చిన్న ఇల్లు కూడా కాదు. ఒక కచ్చితమైన మిద్దెయిల్లు. దంపతులు మాత్రమే వుండటానికి సరిపోతుంది. ప్లీడరు గారి భార్య సరస్వతమ్మ మిద్దెపై వరండాలో కూర్చుని భర్తరాకకై ఎదురు చూస్తున్నది. రాత్రి 9.30 గంటలైనా అతను ఏమో ఆరోజు ఇంటికి రాలేదు. గంటకో బస్సు వచ్చేది పోయేదితప్ప ఆ విశాలమైన వీధి నిశ్శబ్దముగానున్నది.

సరస్వతమ్మగారింటి పెరడు చాలా పెద్దది. అందులో ఇంటి యజమాని టెంకాయచెట్లు కూడా నాటించాడు. ఆ పెద్ద తోటకు పోలిగాడు కావలి. వాడి గుడిసెకూడా ఆ తోటలోనే వుంది. వాడికి భార్య మూడేండ్లబిడ్డతప్ప మరి యెవ్వరూలేరు. పగలంతా కట్టెలు కొట్టేవాడు పోలిగాడు. వానిభార్య 4 ఇండ్లలో పైపనిచేసేది. ఈ మధ్య వారిలో ఏవో తగవులాటలు జరుగుతుండేవి.

వీధివైపు చూస్తున్న సరస్వతమ్మకు అకస్మాత్తుగా ఓ పెద్దకేక వినిపించింది. ఆ వెనుకనే ఏడుపు శబ్దం, దబదబా బాదటం వినిపించాయి. "అయ్యో అమ్మో నన్ను చంపేస్తున్నాడు. అయ్యయ్యో..." పోలిగాని భార్యగొంతు సన్నగిలింది. "నాబిడ్డ కోసమైనా నన్నిలా బ్రతకనివ్వు. నా పీక నులిమెయ్యకు. నీకు పుణ్యముంటుంది" అని దీనంగా ప్రార్థించింది వెంకి. "ఓసేయ్ ... నిన్ను నరికి నాలుగు ముక్కలుచేసినా పాపంలేదు. వాడెక్కడున్నాడో చెప్పు ఇప్పుడే వాడిపనికూడా పట్టిస్తాను. నాకూడుతిని నన్ను మోసం చేస్తావుటే. నాదగ్గరా దొంగ ఏడుపు. నడుము ఇరగ్గొట్టేస్తాను." అని ఇంకా ఏదో వెర్రిగా కేకలేస్తున్నాడు పోలిగాడు. "అయ్యో నేనేపాపం ఎరగను, నమ్మ, ఆ దేముడికే ఎరుక, ఒట్టు, నాబిడ్డ సాక్షిగా చెపుతున్నా. నాకెవడినీ తెలీదు" అని ఏడుస్తుంది వెంకి.

ఇంతలో త్రాగుడు మత్తులో క్రిందపడ్డాడు పోలిగాడు. పొరిగింటివారి సాయముతో వాడిని గుడిసెలోకి తీసుకెళ్లి పడుకోబెట్టింది వెంకి. ఈ గందరగోళమంతా అయ్యేటప్పటికి ప్లీడరు వచ్చారు. సరస్వతమ్మలేచి భర్తకు భోజనముపెట్టి తనుకూడా భోంచేసి కొంచెము సేపటికి ఇద్దరూ పడుకున్నారు.

"అమ్మగారూ తలుపు తీయ్యండి, తెల్లవారింది, పాత్రలు తోమాలి, పాలాయన వచ్చాడు," అని చెప్పి తలుపు తట్టింది వెంకి. సరస్వతమ్మ లేచివచ్చి తలుపు తీసింది. 'ఏమిటే వెంకీ రాత్రి మీయింట్లో ఒకటేగోల. ఇట్లా గోలచేసారంటే మేము ఎలా నిద్రపొయ్యేది? అయ్యగారితో (ఇంటి యజమాని) చెప్తమంటూరా? లేక బుద్ధితెచ్చుకుని గోలచెయ్యకుండా వుంటూరా!" అని మందలించింది సరస్వతమ్మ. "ఏమి చెప్పేదమ్మ గారూ! వాడి త్రాగుమోతు తనానికి తగ్గట్టుగా ఎవరో నామైన లేనిపోని చాడీలు చెప్పుతున్నారు. అదంతా విని వచ్చి నన్ను చావమోదుతాడు. ఈ బాధపడలేక పోతున్నానమ్మగారూ. ఏదైనా బావిలోనో చెరువులోనో పడిచస్తామనిపిస్తున్నది. ఒక్కొక్కప్పుడు" అని భోరున ఏడ్చింది.

"నాకథంతా మధ్యాహ్నమువచ్చి చెపుతాలెండి. దీని కంతకి కారణము ఎవరోకూడా చెప్పతాను." అంది వెంకి ఇంతలో భర్త పిలువగా సరస్వతమ్మ మిద్దెపైకి వెళ్లింది. వెంకి తన పని చూడడానికి వెళ్లింది.

మధ్యాహ్నము భోజనాలైంది. సరస్వతమ్మ తమలపాకు వేసుకుని తోట తలుపుతీసి గుమ్మానికెదురుగా కుర్చీవేసుక కూర్చుని ఆలోచిస్తుంది.

వెంకి నల్లగావున్నా దాని ముఖము చాలా కళగా వుంటుంది. 25 సంవత్సరముల యౌవనవతి, ఆరోగ్యవంతురాలు. బీదరాలైనా ఉన్న రెండు చీరలను వుతికి రోజూ స్నానముచేసి కట్టుకుంటుంది. ఎల్లప్పుడూ నవ్వుతూ నిగనిగలాడుతూ ఆకర్షణీయంగా వుండేది. పోలిగాడు పనిచేసే కట్టెలదొడ్డి యజమాని వెంకిని ఎప్పుడూ చురచుర చూస్తుండేవాడు. వెంకి నిరుపేదయైనా మానవతి, గుణవంతురాలు. పోలిగాడిది వట్టి మట్టిబుర్ర. ఎవరేది చెప్పినా నమ్మిపోతాడు.

వెంకి వచ్చింది. "అమ్మగారూ నాసిగ్గుమాలిన బ్రతుకు సంగతి మీతో చెప్పకోక ఇంకెవరికి చెప్పగలను" అని కూర్చుని చెప్పసాగింది.

నేను మామగాడు ఆ కట్టెల దొడ్డిలో పనిచేసే వాళ్లము. నేను పనిమానేసి రెండునెలలైనది. అప్పటినుండి మాఆయనకు నామీద అనుమానం బయలుదేరింది.

"అయితే నీవు ఎందుకు పనిమానేశావు" అని అడిగింది సరస్వతమ్మ.

"కారణము లేకపోలేదు, చెప్తావినండి. నేను ఆ కట్టెలదొడ్డిలో కూలికి కట్టెలు మోసేదాన్ని. నేను ఆ కట్టెల దొడ్డిలో అడుగుపెట్టగానే మా యజమాని నన్ను గుడ్లు పీకుక్కుని వచ్చేలాగా చూసేవాడు. ఆ చూడటములో బేరానికి వచ్చేవాళ్లకు చిల్లర ఇవ్వడముకూడా మరిచేవాడు. నేను అప్రయత్నంగా ఆయనవేపు చూసేటప్పుడు కన్నుకొట్టేవాడు. నేను ఇదంతా గమనించనట్లుగా వుండేదాన్ని. కాని కొన్నాళ్లకు తరువాత కారణము లేకుండా నాతో బాతాఖాని మొదలెట్టాడు. నేనెట్లాగో తప్పించుకొని తిరిగేదాన్ని.

ఒకరోజున సాయంత్రము ఒక పెద్దాయనవచ్చి ప్రక్కవీధికి 5 మండ్లు కట్టెలు మోసుకు రమ్మని చెప్పారు. అప్పటికే మసక చీకటి క్రమ్మింది. ఆ ముసలాయన అలా నిల్చుంటే నేను కొంచెము కొంచెముగా కట్టెలు తీసుకువెళ్లి వారి ఇంటిలో వేశాను. కట్టెలు అయ్యేటప్పటికి బాగా చీకటి పడింది. ఆ ముసలాయన నాచేతిలో కూలి డబ్బులు పడేసి వెళ్లిపోయాడు. ఇంటికి పోదామని నేను రెండు అడుగులు వేసేటప్పటికి యజమానుడు నన్ను పిలిచాడు. "వెంకీ! ఇలారా - నాకు ఒక బీడీల కట్ట తెచ్చిపెట్టు. ఇదిగో చిల్లర." అని నా చేతులలోకి పడేశాడు. నాకు జల్లుమనిపించింది. అయినా విధిలేక వెళ్లి బీడీలు పట్టుకొచ్చి వాని ఎదుట బల్లపైనపడేసి గిరుక్కున తిరిగాను. అంతలో నాచీర చెంగు లాగినట్లనిపించింది. తిరిగి చూశాను. ఇంకేముంది నేననుకున్నపని జరిగింది. ఒక్క నిముషము నాఒళ్లు గడగడ వణికిపోయింది. అయినా ధైర్యము తెచ్చుకున్నాను. ఇంతలో వాడు నా చేతులు పట్టుకొని "వెంకీ మరేమి భయపడకు. ఇక్కడ ఎవ్వరు చూడరులే. ఇలా దగ్గిరికిరా. ఇవ్వాళ నువ్వు చాలా అందంగా కనుపిస్తున్నావు సుమీ. ఈ రెండు నెలలుగా నీకోసము ఎంతగా తపించిపోతున్నానో తెలుసా. ఇన్నాళ్లకి నీవు నాకీరోజున దక్కినావు. ఇదుగో ఈ 5 రూ.లు తీసుకో, నాకోరికతీర్చు" అని నన్ను కౌగిట్లోకి లాక్కోబోయాడు. అంతవరకూ భయంతో బొమ్మలాగ నిలబడిపోయిన నాకు వానిమాటలువిని అరికాలి మంట నెత్తికెక్కింది. అంతే నాచేతులు విడిపించుకొని ఒక్క త్రోపు త్రోశాను. దాంతో కుర్చీపైనుంచి క్రింద బడ్డాడు. వాడికళ్లు ఎర్రగా చింతనిప్పుల్లాగ తయారయ్యాయి. కోపంతో మాట్లాడలేకపోయాడు. అంతతో నేను వూరికే వుండక "ఛీ దుష్టముండాకొడుకా! నీకేమి పొయ్యేకాలమురా! నామగడు చూశాడంటే నీ ఎముక విరగ్గొడతాడు. వాడికి ఈ సంగతి తెలిస్తే నీవు చచ్చావన్నమాటే. జాగ్రత్త, ఇంక నాజోలికిరాకు, నామానాన్ని అమ్ముకునేకంటే నాలుగిళ్లు ముష్టియెత్తుకుంటాను. నీ వెధవ డబ్బులు ఎవరిక్కావలి. ఇంకో సారి నాజోలికొచ్చావంటే చీపురుకట్టతో సింగారిస్తాను" అన్నాను. అప్పుడు వాడికంటికి కాళమ్మలాగు కనుపించాను కామోసు. ఒక్క క్షణం

గజగజలాడిపోయాడు. అయినా సమాళించుకొని "హో మహాపతివ్రతల్లే వున్నావే! బలవంతానైనా నా కోరిక తీర్చుకోగలను. కానియ్యి, ఇంక చూచుకో నా దెబ్బ. నీమగడి చేతనే నిన్ను తన్నిస్తాను" అన్నాడు. వాని మాటలు వినిపించుకోకుండా ఇంటివైపు నడిచాను.

మామగాడిది వట్టిమట్టి బుర్ర. ఎవరేది చెప్పినా నిజమని నమ్ముతాడు. ఆ కట్టెల దొడ్డివాడు నాపైన లేనిపోనిది చెప్పితే విని నిజమనుకొని నన్నిలా చావ చంపుతాడు. నేనేంచెయ్యి నమ్మగారూ. ఈ తిట్లు దెబ్బలు భరించలేకుండా వున్నాను." అని ఏడవ సాగింది వెంకి.

"అయితే వెంకీ! ఇదంతా నిజమేనా?" అనింది సరస్వతమ్మ.

"అమ్మగారూ ఇదంతా నిజము-నా బిడ్డతోడు" అని జాలిగా సరస్వతమ్మవైపు చూచింది. సరస్వతమ్మకు జాలివేసింది. కొంచెము సేపు ఆలోచించి "అయితే ఇలా నా దగ్గరికి రా" అని వెంకి చెవిలో ఏదో రహస్యము చెప్పింది, "అలా చెయ్యి, తప్పకుండా నీమగడు దారికి వస్తాడు" అనింది.

వెంకి ముఖము కొంత వికసించినది. "అలాగే చేస్తా నమ్మగారూ నేను పోయివస్తా."

ఓ వారము రోజులు పోలిగాడికి ఎక్కడా కల్లు దొరకలేదు. వెంకికి దెబ్బలుకూడా చాలా మట్టుకు తగ్గింది. ఆ రోజు శుక్రవారము తెల్లవారినుండి సాయంత్రము వరకు అష్టకష్టాలుపడి రెండు బుడ్డీల సారాయి తీసుకొని చీకటివేళకు ఇంటికొచ్చాడు. దారిలో కట్టెలదొడ్డి యజమానుడు ఎదురై "ఒరే పోలిగా నీపెళ్లాం వాడితో నీవు త్రాగుతావని పోలీసుకు రిపోర్టు చెయ్యమని చెప్పిందిరా. నీవు జైలు కెళ్లావంటే, ఇక్కడ వాళ్లిద్దరు ఆనందంగా హాయిగా భయంలేకుండా వుండవచ్చనికూడా చెప్పిందిరా. వాడుకూడా సరేనని తలవూపాడు. ఇంక జాగ్రత్తగావుండు," అని చెప్పి తన దారిని పోయాడు. ఇదుగో ఇప్పుడే దాన్ని రెండు ముక్కలక్రింద నరికి పారేస్తాను. అని గొణుక్కుంటూ ఇల్లుచేరుకున్నాడు. వెంకి ఇంటిలో లేదు వాడి కోపము రెట్టింపుగా మారింది. త్రాగడం మొదలు పెట్టాడు. ఆ మత్తులో వెంకిని ఎదురుచూస్తూ కన్నట్లు తిట్టసాగినాడు.

వెంకి మరో ఇంట్లోకూడా పనిచేసేది. వారు నూతన దంపతులు. పైగా క్రొత్త కాపురం. విమలకు రాత్రిపూట ఒంటరిగా వుండాలంటే చాలా భయము. ఆ రోజు తన భర్త ఇంటికి రావడానికి చాలా ఆలస్యమైనది. ఒంటరిగా వుండలేక వెంకిని తన భర్త వచ్చేంతవరకు వుండమని చెప్పింది. అందుచేత వెంకి ఆమెతో వుండవలసి వచ్చింది.

విమల భర్త ఇంటికి వచ్చేటప్పటికి 9-30 గంటలయింది. చాలా రాత్రిఅయి ఇంటికి వెళ్లితే భర్త తన్నేమి చేస్తాడోనని వెంకి భయపడుతూ ఇంటికి వెళ్లింది. ఇంట్లో భర్త రాక్షసుడులాగ ఏనిమిషాన వెంకిని చంపుతాడో అన్నట్లు వెంకిని తిట్టుతూ భయంకరంగా కేకలు వేస్తున్నాడు. త్రాగుడు మత్తులో వాడికి ఒళ్లు తెలియలేదు. వెంకి గజగజ వణకిపోతూ ఇంట్లో అడుగు పెట్టింది.

దాన్ని చూస్తూనే పోలిగాడికి ఎక్కడలేని కోపము వచ్చేసింది. కళ్లు చింతనిప్పుల్లాగ వున్నాయి. వెంటనే లేచి వెంకి జుత్తు పట్టుకున్నాడు. "ఒసేయ్ నిజంచెప్పు. ఎక్కడినుంచి వస్తున్నావు. వాడితో సరసాలాడి వస్తున్నావుటే," నాలుగు గ్రుద్దులు గ్రుద్దినాడు. "ఈ వాళ నిన్ను బలేస్తాను తెలుసా" "అయ్యో అమ్మ నన్ను వదిలెయ్యరా బాబూ నీకు దణ్ణం పెడతను. ఇవ్వాళ నేను పనిచేసే ఇంటి ఆమె యజమానుడు చాలా ఆలస్యంగా ఇంటికొచ్చాడు. ఆమెకు ఇంతసేపు నేను తోడు వుండాల్సి వచ్చింది. నమ్ము నిజము చెప్పేను, ఇంక విడిచిపెట్టు" అని దీనంగా ఏడుస్తోంది వెంకి.

"అమ్మ దొంగా ఎంతలేని అబద్ధాలుకూడా నేర్చావు! నీ మాయ మాటలు నమ్ముతాననుకున్నా. ఈ పోలిగాడెవరనుకున్నావ్. నీ పాలిటి రెండో యముడు. నిజము చెప్పు. వాడెవడో ఇప్పుడెక్క-

దున్నాడో చెప్పు. చెప్పుతావా! లేదా!" అని తన్నడం మొదలెట్టాడు. దెబ్బలకు తాళలేక వెంకి క్రింద పడింది. దాని కడుపు కాలితో అదిమి, రెండు చేతులతో దాని గొంతు నొక్కాడు. కసి తీరిపోయింది. చేతులు దులుపుకున్నాడు. వెంకి నోట్లో మాటలేదు. కళ్లు మూతబడ్డాయి. చచ్చిన పీనుగలాగుపడివుంది.

వెంకి లేవకపోవడముచూచి చెయ్యి పట్టుకొని ఎత్తినాడు. ఎత్తిన చెయ్యి ఎత్తినట్టే క్రిందపడింది. పోలిగాడికి త్రాగుడుమత్తు పూర్తిగా తీరింది. మరల ఒకసారి ఇటున్న ముఖము అటు త్రిప్పాడు. ముక్కు దగ్గర చెయ్యిపెట్టి చూచాడు. వూపిరి ఆడలేదు. గుండెలు అంటి చూశాడు. కొట్టుకోడంలేదు. అంత వాడికి భయము దుఃఖము పొంగి పొరలింది.

"అయ్యో వెంకీ నిన్ను చేతులారా చంపేశాను. అయ్యయ్యో నాగతేమి, ఇంకెప్పుడిలా చెయ్యను. అయ్యో నన్ను చూడు, కళ్లు తెరు, అయ్యో నా వెంకి," అని భోరున ఏడువ నారంభించాడు.

అప్పుడే అక్కడికి వచ్చిన కట్టెలదొడ్డి యజమానుడుకి ఇదంతా చూచి భయము ఆశ్చర్యము వేసింది. "ఒరేయ్ పోలిగా నీపెళ్లాన్ని చంపేశావా? అయ్యో సీతమ్మ లాంటిది. ఆఖరికి నీ చేతులోపడి చచ్చిపోయిందా. ఇప్పుడే పోలీసుకు రిపోర్టు చేస్తాను," అని చరచరా నడిచివెళ్లిపోయాడు.

ఈ మాటలు వినగానే పోలిగాని ఏడుపు హటాత్తుగా ఆగిపోయింది.

"హా! నాపెళ్ళాం పతివ్రతనా! సీతమ్మ లాంటిదా! అది చెడిపోలేదా! మరి-మరి వీడే కదా నాకు లేనిపోని అనుమానాలు నూరిపోశాడు. ఇప్పుడు వీడినోటెంబడే ఇదంతా వింటున్నానా. ఆ అంతా తెలిసింది. మోసం, మోసం ఆ పాపాత్ముడి మాటవిని నిన్ను అనుమానించాను. అదే నన్నింతకి తెచ్చింది. అయ్యో వెంకీ ఒక్కసారి నోరుతెరిచి నన్ను క్షమించానని చెప్పవూ అని మరల వెక్కివెక్కి ఏడవసాగినాడు. ఇదంతా ఏమి అర్థం కాని ఆ మూడేండ్ల బిడ్డడు తన తల్లిని ఎత్తుకోమని చెప్పి తన చిన్ని చేతులతో తట్టిలేపి ఆమె లేవనందుకు మరింత గట్టిగా ఏడుస్తున్నాడు.

ఇంతలో కట్టెలదొడ్డి యజమాని, వాని వెంబడే ఇద్దరు పోలీసు జవానులు వచ్చారు. పోలిగడికి సంకెళ్లు తగిలించి స్టేషనుకు లాక్కుపోతున్నారు. తల్లి ఎత్తుకోనందుకు, తండ్రికూడా వెళ్లిపోతున్నందుకు, ఆ బిడ్డడు పెద్దపెట్టున గుండె నీరవునట్లు ఏడుస్తున్నాడు.

ఇన్స్పెక్టరు:- ఏయ్ నీపేరేమి?

పోలిగాడు:-పోలిగడండి.

ఇన్స్పెక్టరు:-నీ భార్యను నీవే చంపినావా?

పోలిగాడు:-"చిత్తము. ఇదుగో ఈయనే నాకు నా పెళ్లాంమీద లేనిదంతా చెప్పి నమ్మించి చేతులారా చంపించాడు" అన్నాడు కోపముతో కట్టెలదొడ్డి యజమానుని వంక చూపిస్తూ.

ఇన్స్పెక్టరు: ఎయ్ నోరుముయ్. నీ పెళ్లాన్ని హత్యచేసింది కాకుండా ఆ పెద్దమనిషిని అవమానిస్తావా. దానికి ఫలితము అనుభవించు. నంబర్ 304, నంబర్ 102. వీడ్ని తీసుకెళ్లి బాగా తన్నండి.

వెంటనే ఇద్దరు పోలీసు జవానులు వాడ్ని తీసుకెళ్లినారు.

"అయ్యో, అమ్మా, బాబో" అని అరుస్తున్నాడు పోలిగడు దెబ్బలకి. "అమ్మ గాడిద కొడకా. ఒకటి పెళ్ళాన్ని చంపావు; రెండవది ఒక పెద్ద మనిషిని అవమానించావు. అమ్మా, అబ్బా, అంటావా? రేపీపాటికి వురికంబాని వేలాడుదువుతే. అంతవరకు చచ్చినకుక్కలాగుండు." అని మరల నాలుగు దెబ్బలు వేశాడు. ఇంతలో "ఆగండి, ఆగండి నేను బ్రతికే వున్నాను" అని కేక వినిపించింది.

ఇన్స్పెక్టరు తిరిగి చూచాడు. వెంకినిచూచి ఆశ్చర్యపోయాడు. "ఆయన్ని కొట్టకండి, ఆయ

నేమి తప్పుచెయ్యలేదు. నేనే ఇవ్వాళ అంబలిలో చిలుముపడింది చూడకుండా త్రాగివేశాను, మైకము వచ్చింది, వాంతి అయ్యింది, వెంటనే అలా కొయ్య బారిపోయాను. నేనలా వుండటంచూచి ఆయనకి మతిభ్రమించి తనేనన్ను చంపేశాడని చెప్పుకుని ఏడ్చాడు - అంతే. ఎవరోపడనివాళ్లు లేనిపోనివి చెప్పుతారు. అవన్ని నమ్మకండి. నేను బ్రతికే వున్నాను. ఇంక ఆయన్ని విడిచిపెట్టండి" అని బ్రతిమాలింది వెంకి.

వెంటనే ఇన్‌స్పెక్టరు పోలిగాడ్ని తీసుకొచ్చిన జవానులనుపిలిచి, "మీరు చచ్చిపోయిందని చెప్పిన ఆడది ఇదేనా?" అని అడిగాడు. "అవునండి" అన్నారు జవానులు. "ఒరేయ్ పోలిగా నీ పెళ్లాం చెప్పిందంతా నిజమేనా?" "అవునండి" అని తల వూపాడు.

సరే ఇంక మీరిద్దరు పోవచ్చును. కేస్ డిస్‌మిస్ చేస్తున్నాను. ఈ సందడిలో మెల్లగా జారిపోయాడు కట్టెల దొడ్డివాడు. పోలిగాడు వెంకి ఇంటివైపు నడిచారు.

ఇంటికి రాగానే పోలిగాడు వెంకి రెండు చేతులు పట్టుకుని, "వెంకీ నువ్వు ఇంత బుద్ధిమంతు రాలవని అనుకోలేదు. నిన్ను చాలా బాధపెట్టాను. ఇంక నీమైన ఎవరైనా ఏదిచెప్పినా నమ్మను, వినను. త్రాగుడు ముట్టుకోను. నన్ను క్షమించవూ?" అన్నాడు పశ్చాత్తాపముతో. "చాల్లే పిచ్చి మామయ్యా వూరుకో. ఇంకనాన్న బుద్ధిగావుండు. అదే నాకు పదివేలు" అనింది వెంకి.

పోలిగాని మట్టి బుర్రకి ప్రేమ అంటే ఏమిటో ఇప్పుడు బాగా అర్థమైంది. వీళ్ల మాటలంతా తెలుసుకున్నట్లు కిలకిలా నవ్వాడు వెంకి ఒడిలోని పాపాయి.

వారము రోజులు గడిచింది. ఆ రోజు దీపావళి. వెంకి 3 గంటలకేలేచి స్నానముచేసి, దోసెలుకాల్చి కూర వండింది. పెనిమిటిని కొడుకును లేపి తలంటి పోసి దోసెలు కూర వడ్డించింది. వాళ్లు ఇద్దరుతిని లేచాక తనుకూడా దోసెలుతిని, వకీలుగారింటి పనికి వెళ్లింది. అప్పటికి సరస్వతమ్మ లేచి స్నానముచేసి తల ఆర్చుకొంటూంది, వంటామె పిండివంటలు చేస్తూంది.

వెంకిని చూస్తూనే సరస్వతమ్మ "రా వెంకి రా. ఈవాళ మీఇంట్లో దీపావళి బలంగా వున్నట్టుందే" అనింది. "అవునమ్మగారూ మీరు చెప్పిన యుక్తి అచ్చురాలా ఫలించింది. ఆ రోజు మీరు చెప్పినట్లు అరగంటసేపు వూపిరి బిగబట్టి చచ్చిన పీనుగులాగా పడివుండినాను. అబ్బా లేకపోతే మా ఆయనకు ఈ జన్మంలో బుద్ధివచ్చేదికాదు. ఈ రోజు దీపావళి అని తెలిసికూడా కల్లు ముట్టుకోలేదు. మీ దయవల్ల ఇప్పటికి నా బ్రతుకు తెల్లవారింది. ఇప్పటికి నాసంసారము సుఖంగా సాగుతుంది." అని చెప్పి తనపని చూడటానికి లోపలికి వెళ్లింది వెంకి.

కుష్ఠు ★ బొల్లి

వగైరా మేహముచ్చలు, సెగ, సవాయి వ్యాధులకు గ్యారంటీ చికిత్స :—

క్యాటలాగు ఉచితము.

భాస్కర తైలము:- సర్వనొప్పులకు, కర్ణరోగములకు, దెబ్బలకు, తెగవులకు, పుండ్లకు, విషజంతువుల కాట్లకు, కలరా, ఋతుశూలలువగైరా అన్ని స్త్రీవ్యాధులకు గ్యారంటీగా పనిచేయును. సీసా వెల రు 2-0-0 లు. పూర్తివివరములకు :

జి. వి. రెడ్డి అండ్ కో (రిజిష్టర్డు)
"భాస్కరాశ్రమము", గోపాలపురం, తూర్పుగోదావరిజిల్లా.